జగిత్యాల అభివృద్ధికి సహకరించాలి

- మిగిలిన 800 డబుల్ బెడ్రూం ఇండ్లను లబ్ధిదారులకు అందించాలి
- ఎమ్మెల్సీ ఎల్ రమణతో కలిసి మంత్రులకు విన్నవించిన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

మంత్రులను కలిసి నిధులు మంజూరు చేయాలని కోరుతున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

జగిత్యాల కలెక్టరేట్, జనవరి 16: జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ ఎల్ రమణతో కలిసి రాష్ట్ర నీటి పారుదల, సివిల్ సప్లయ్ శాఖల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి విన్నవించారు. నియోజకవర్గంలోని బీర్‌పూర్ మండలంలో గల రోళ్ల వాగు నిర్మాణ పనులు చివరి దశకు వచ్చాయని, గేట్లు బిగించేందుకు అటవీ క్లియరెన్స్‌ను త్వరగా ఇప్పించి గేట్లు బిగించి ప్రాజెక్టులో నీటిని నింపాలని, జగిత్యాల పట్టణంలో ఇండ్లులేని నిరుపేదల కోసం జగిత్యాల అర్బన్ కాలనీలో 4,520 డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించి లబ్ధిదారులకు అందజేశామని, మిగిలిన 800 డబుల్ బెడ్రూం ఇండ్లను పట్టణానికి చెందిన అర్హులకు అందించాలని కోరారు. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ ఆన్‌లైన్‌లో ఇందిరమ్మ ఇల్లు ఉన్నట్లు చూపుతుందని, దీంతో డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయడంలో సమస్య తలెత్తుతుందని, సమస్యను పరిష్కరించి ఇండ్ల లేని నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. జీవనోపాధి కోసం లారీ, ట్యాక్సీలు ఉన్న వారికి సైతం అనర్హులుగా చూపడంతో వారు ఇబ్బందులు పడుతున్నారని, మరోసారి సర్వే నిర్వహించి వారికి ఇండ్లు వచ్చేలా చూడాలని మంత్రులను కోరామన్నారు. ఇందుకు వారు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా జగిత్యాల వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి కోరగా, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయిను కలువాలని మంత్రి సూచించారని, దీంతో లక్ష్మీబాయిని కలువగా, నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

మాజీ మంత్రి జైపాల్‌రెడ్డికి నివాళి

కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి జయంతి సందర్భంగా నక్లెస్ రోడ్డులో జైపాల్ రెడ్డి సమాధి స్ఫూర్తి స్థల్ వద్ద జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ ఎల్ రమణ నివాళులర్పించారు.

జీవన్ రెడ్డి, లక్ష్మణ్ కుమార్‌ను సన్మానిస్తున్న సురభి గోశాల ప్రతినిధులు

గోశాలలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పూజలు

జగిత్యాల, జనవరి 16: సంక్రాంతి పండుగ కనుమను పురస్కరించుకొని తాటిపల్లి గ్రామ శివారులోని సురభి గోశాలలోని గోవులకు పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి కుటుంబ సభ్యులతోపాటు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కుటుంబసభ్యులతో కలిసి గోవులకు నూతన వస్త్రాలు కప్పి, పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ, పశువుల సంరక్షణకు సురభి గోశాల నిర్వహణ అభినందనీయమని, సురభి గోశాల ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్నదని అన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, సురభి గోశాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ

రాయికల్, జనవరి 16: పట్టణానికి చెందిన గుర్రాల ప్రసాద్ అనారోగ్యంతో, కొత్తపేట గ్రామానికి చెందిన శేఖర్ తల్లి ఇటీవల మరణించారు. వారి కుటుంబ సభ్యులను మంగళవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు.

కేటీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

కేటీఆర్, ఈశ్వర్‌తో బీఆర్ఎస్ మండల నాయకులు

పెగడపల్లి, జనవరి 16: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను మంగళవారం సిరిసిల్లలో పార్టీ మండల నాయకులు ఇరుగురాల ఆనందం, మాదారపు కరుణాకర్‌రావు కలిశారు. సిరిసిల్లలోని పార్టీ కార్యాలయంలో కేటీఆర్, ఈశ్వర్‌ను వారు కలిశారు.

పలువురికి చల్మెడ లక్ష్మీనర్సింహారావు పరామర్శ

విజయసాగర్‌ను పరామర్శిస్తున్న చల్మెడ లక్ష్మీనర్సింహారావు

మేడిపల్లి, జనవరి 16 : మేడిపల్లి మండలం బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు అంకం విజయసాగర్ తల్లి రాజుబాయి అనారోగ్యంతో మరణించగా మంగళవారం వారి కుటుంబసభ్యులు, ఎంపీటీసీ అంకం వినోద-విజయసాగర్‌ను చల్మెడ లక్ష్మీనర్సింహారావు పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకొని తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. వారి వెంట సర్పంచ్ ద్యావనపెల్లి అభిలాశ్, నాయకులు దోనకంటి వేణుగోపాల్‌రావు, చెన్నమనేని అజిత్‌రావు, రావు శ్రీనివాస్‌రావు, అంగడి ఆనంద్‌కుమార్, గోపు రాజారెడ్డి, మేన్నేని ప్రభాకర్‌రావు, పొట్టవత్తిని గణేశ్ తదితరులు ఉన్నారు.

సిరికొండ గ్రామంలో

కథలాపూర్, జనవరి 16: సిరికొండ గ్రామానికి చెందిన ముదాం రాజనర్సు అనారోగ్యంతో మృతి చెందగా మంగళవారం ఆమె కుమారుడు ముదాం రవిని బీఆర్ఎస్ నాయకులు చల్మెడ లక్ష్మీనర్సింహారావు పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకొని తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. వారి వెంట జడ్పీటీసీ నాగం భూమయ్య, నాయకులు వర్ధినేని నాగేశ్వర్‌రావు, రవి, మహేందర్, ఆకుల నర్సయ్య, రామాంజనేయులు, నవీన్, దశా గౌడ్, కిశోర్, ముజీబ్, జ్యోతిబాబు, దివ్య రాజు, భూమయ్య ఉన్నారు.

మున్సిపల్ వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టాలని వినతి

జగిత్యాల అర్బన్, జనవరి 16: జగిత్యాల మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్‌గా వ్యవహరిస్తున్న వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని 30 మంది కౌన్సిలర్లు జిల్లా అడిషనల్ కలెక్టర్ బీఎస్ లతకు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ మేరకు అవిశ్వాసం ఏర్పాటు చేయాలని కౌన్సిలర్లు సంతకాలు చేసిన ప్రతిని అడిషనల్ కలెక్టర్‌కు అందజేశారు.

టీఎన్జీవో క్యాలెండర్ ఆవిష్కరణ

జగిత్యాల, జనవరి 16: టీఎన్జీవోల సంఘం 2024 సంవత్సర క్యాలెండర్‌ను కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా మంగళవారం ఆవిష్కరించారు. టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు బోగ శశిధర్, జిల్లా కార్యదర్శి మిర్యాల నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాషా మాట్లాడుతూ, ఉద్యోగుల నిరంతర కృషి వల్లే జిల్లా అన్నిరంగాల్లో ముందు వరుసలో ఉందని, అలాగే ఉద్యోగుల సంక్షేమం కోసం టీఎన్జీవో సంఘం కృషి చేస్తుందన్నారు. అనంతరం ఉద్యోగులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, భువనేశ్వర్, మధుకర్, సుగుణాకర్, వెంకట పవన్, భాస్కర్, శంకర్, రఘు, శ్రీకాంత్, మహిపాల్, రియాజ్, మునీందర్, సాయి, శ్యాం, శ్రావణి, ఇంద్రజ పాల్గొన్నారు.

ప్రభుత్వ అడ్వొకేట్ జనరల్‌ను కలిసిన నాయకులు

సారంగాపూర్, జనవరి 16: ప్రభుత్వ అడ్వొకేట్ జనరల్‌గా నియామమైన రేచపల్లి గ్రామానికి చెందిన ఎడమల సుదర్శన్ రెడ్డిని మంగళవారం సర్పంచ్ ఎడమల జయ-లక్ష్మిరెడ్డి కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొండ్ర రాంచందర్ రెడ్డి హైదరాబాద్‌లోని తన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎడమల సుదర్శన్ రెడ్డి స్వగ్రామం రేచపల్లికి రావాలని గ్రామ సర్పంచ్ ఎడమల జయ-లక్ష్మారెడ్డి సుదర్శన్ రెడ్డిని ఆహ్వానించగా త్వరలోనే వస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. వీరితో పాటు పలువురు వారిని అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో ఎడమల సుధాకర్ రెడ్డి, యాసాల మల్లికార్జున్, భూక్యా సురేందర్‌నాయక్ పాల్గొన్నారు.

భూ తగాదాలతో ఇద్దరు రైతుల ఆత్మహత్యాయత్నం

పెగడపల్లి, జనవరి 16: దోమలకుంట గ్రామంలో భూ తగాదా విషయంలో బండారి శ్రీనివాస్, తొట్ల శేఖర్ సోమవారం ఇద్దరు రైతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఒకరి తరువాత ఒకరు పురుగుల మందు తాగుతూ, సెల్ఫీ వీడియోలు తీసుకోవడంతో పాటు, వాటిని సోషల్ మీడియాలో పోస్టులు చేయగా, వైరల్‌గా మారింది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ సీహెచ్ సతీశ్ ఇద్దరిపైనా కేసు నమోదు చేశారు. కాగా వీరికి జగిత్యాలలో చికిత్స అందిస్తున్నారు. బండారి శ్రీనివాస్‌ను ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మంగళవారం పరామర్శించారు.

ఆధ్యాత్మిక భావనతోనే ఆనందం

మెట్‌పల్లి రూరల్, జనవరి 16: ప్రజలంతా ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకున్నప్పుడే ఆనందం సిద్ధిస్తుందని సత్యానాందాశ్రమ పీఠాధిపతి శ్రీ హరితీర్థ స్వామి, శివరామకృష్ణ తపోవనం పీఠాధిపతి శ్రీ విరజానందస్వామి పేర్కొన్నారు. వేంపేట గ్రామంలో శ్రీరామకృష్ణ సంకీర్తన మండలి ఆధ్వర్యంలో సోమవారం వన భోజనాలు నిర్వహించారు. ముందుగా ప్రార్థనలు, భజనలు చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన పీఠాధిపతులు భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. కార్యక్రమంలో శ్రీ మాత పరమేశ్వరి మండలి వ్యవస్థాపకుడు బాలయ్య, సత్యానంద భక్త మండల సభ్యులు పాల్గొన్నారు.

గాలిపటాలు ఎగురవేస్తూ కరెంట్ షాక్‌కు గురైన చిన్నారులు

కోరుట్ల, జనవరి 16: పట్టణంలోని భీమునిదుబ్బ కాలనీలో సోమవారం గాలి పటాలు ఎగురవేస్తున్న ఇద్దరు చిన్నారులు కరెంట్ షాక్‌తో తీవ్రంగా గాయపడ్డారు. చిన్నారుల కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తోకల కిష్టయ్య కుమారుడు సాత్విక్, పూర్ణం దుర్గా ప్రసాద్ కుమారుడు ప్రశాంత్‌తో కలిసి దాబాపై ఎక్కి గాలి పటాలు ఎగుర వేస్తున్నారు. గాలి పటం తెగి దాబా పక్క నుంచి వెళ్తున్న హైటెన్షన్ విద్యుత్ తీగలకు చుట్టుకోవడంతో గాలిపటాన్ని తీసేందుకు ప్రయత్నించారు. దీంతో చిన్నారులు ఇద్దరికి విద్యుత్ షాక్ తగలడంతో సాత్విక్ (10) ముఖం, కాళ్లు, చేతులు కాలిపోగా అపస్మారకస్థితికి చేరుకున్నాడు. ప్రశాంత్ (12) దాబాపై నుంచి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన కుటుంబసభ్యులు ఇద్దరు చిన్నారులను స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో సాత్విక్ పరిస్థితి విషమంగా మారడంతో వైద్యుడి సూచనలతో హైదరాబాద్‌కు తరలించారు. కాగా సాత్విక్ ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి, ప్రశాంత్ ఓ ప్రైవేట్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

పట్టణంలోని పలు కాలనీల నుంచి వెళ్తున్న 33/11 కేవీ విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. ఈ హైటెన్షన్ విద్యుత్ తీగలతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని కాలనీ వాసులు భయాందోళనలకు గురవుతున్నారు. సంక్రాంతి పండుగ వేళ ఇద్దరు చిన్నారులు హైటెన్షన్ విద్యుత్ తీగలు తగిలి తీవ్రంగా గాయపడడంతో కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రకాశం రోడ్డు, ఝాన్సీ రోడ్డు, కల్లూరు రోడ్డు, భీమునిదుబ్బ కాలనీల మీదుగా 40 ఏళ్లుగా 33/11 కేవీ విద్యుత్ లైన్ వెళ్తుంది. గతంతో పోల్చుకుంటే ఇప్పుడు పట్టణం అభివృద్ధి చెంది శివారు ప్రాంతాల్లో జనవాసాలు వెలిశాయి. ఊరు చివర ఉండాల్సిన హైటెన్షన్ తీగలు ఇప్పుడు ఇండ్ల మధ్య నుంచి వెళ్లడంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. హైటెన్షన్ విద్యుత్ తీగలు తొలగించాలని ఎన్నిసార్లు వినతులు ఇచ్చినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకున్న పాపాన పోలేదని కాలనీవాసులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హైటెన్షన్ తీగలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

విద్యుత్ తీగలను పరిశీలించిన ఎస్ఈ

భీమునిదుబ్బ ప్రాంతంలో ఉన్న 33/11 కేవీ విద్యుత్ లైన్‌ను మంగళవారం విద్యుత్ ఎస్ఈ సత్యనారాయణ పరిశీలించారు. సోమవారం హైటెన్షన్ విద్యుత్ తీగలు తగిలి ఇద్దరు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డ ఘటన విషయమై అధికారుల నుంచి వివరాలను తెలుసుకున్నారు. హైటెన్షన్ విద్యుత్ తీగలను శివారు ప్రాంతాల నుంచి ఏర్పాటు చేసేందుకు సర్వే నిర్వహించాలని ఆయన అధికారులకు సూచించారు. ఇక్కడ పట్టణ విద్యుత్ ఏడీఈ ఆంజనేయరావు, ఏఈలు, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

కొండగట్టు అంజన్న ఆలయంలో భక్తుల రద్దీ

దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

మల్యాల, జనవరి 16: కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి సన్నిధానంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. వేకువజాము నుంచే భక్తులు క్యూలో వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, పాలకమండలి చైర్మన్ తిరుక్కోవెల మారుతీస్వామి భక్తుల రద్దీని గమనిస్తూ ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో పర్యవేక్షకుడు సునీల్, ఆలయ ఇన్‌స్పెక్టర్లు జెమిని శ్రీనివాస్, సంపత్, లక్ష్మారెడ్డి తదితరులు తదితరులు పాల్గొన్నారు.

నర్సన్న సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి, జనవరి 16: సంక్రాంతి పండుగ సందర్భంగా ధర్మపురి లక్ష్మీనర్సింహస్వామివారి సన్నిధిలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. పండుగ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారలను దర్శించుకున్నారు. ఆలయంలో స్వామివారికి పట్టెనామాలు, కోరమీసాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా సిబ్బంది తగిన ఏర్పాట్లు చేశారు.

లింక్ కెనాల్ పరిశీలన

కెనాల్‌ను పరిశీలిస్తున్న విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

మల్యాల, జనవరి 16: తాటిపల్లి గ్రామ శివారులో పెగడపల్లి మండలంలోని పలు గ్రామాలకు సాగునీరు అందించే వరదకాల్వ, కాకతీయ కాల్వల అనుసంధాన కెనాల్ వద్ద గల రెగ్యులేటర్లను ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అధికారులతో కలిసి పరిశీలించారు. లక్ష్మణ్‌కుమార్ ఈఈ సుధాకిరణ్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ నాయకులు దొంగ ఆనందరెడ్డి, దారం ఆదిరెడ్డి, ముత్యపు శంకర్, లక్ష్మణాచారి, సతీశ్‌రెడ్డి, గాజుల అజయ్‌గౌడ్, డీఈఈ రూప్లానాయక్ ఉన్నారు.

గ్రామాల్లో క్రీడా, ముగ్గుల పోటీలు

ధర్మపురి: మహిళకు బహుమతి అందజేస్తున్న బోగ శ్రావణి

ధర్మపురి, జనవరి 16: తిమ్మాపూర్ గ్రామంలో అదే గ్రామానికి చెందిన వావిలాల ఉమారాణి ఇటీవల మరణించగా ఆమె జ్ఞాపకార్థం సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఉమారాణి కుటుంబసభ్యులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్ సతీమణి కాంతకుమారి, సర్పంచ్ శేఖర్, ఎంపీటీసీ సత్యం, నాయకులు లింగాల హరీశ్, ఉమారాణి కుటుంబసభ్యులు వావిలాల ప్రకాశ్, భూసాగర్, జగదీశ్వర్ ఉన్నారు.

మేడిపల్లి, జనవరి 16: భీమారం మండల కేంద్రంలో సోమవారం ఉమ్మడి మేడిపల్లి మండల స్థాయి కబడ్డీ పోటీలను సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి ప్రారంభించారు. పోటీల్లో విన్నర్‌గా కాచారం జట్టు, రన్నర్‌గా వెంకట్రావుపేట జట్టు నిలిచాయి. కార్యక్రమంలో సర్పంచ్ చెక్కపెల్లి అరుణ, ఎంపీటీసీ పల్లి అర్జున్, ఉప సర్పంచ్ బస్వరాజుల రాజు, నిర్వాహకులు చెక్కపెల్లి సంజీవ్, బొమ్మెన ప్రశాంత్, ద్యావనపెల్లి రాకేశ్, కొత్తపెల్లి రాజేందర్, పీఈటీలు సిరిపురం మోహన్, పల్లికొండ మహేశ్, నాయకులు చెక్కపెల్లి రఘు, గుగ్గిళ్ల రవి గౌడ్, చెక్కపెల్లి అజయ్, పానుగంటి రాజేశ్, వినోద్ పాల్గొన్నారు.

గొల్లపల్లి, జనవరి 16: మల్లన్నపేట గ్రామంలో బీఆర్ఎస్వీ మండలాధ్యక్షుడు అవారి చందు, దట్నూర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సర్పంచ్ ఆకుల పావని-నగేశ్ ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. మల్లన్నపేటలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల్లో ప్రథమ విజేతగా నిలిచిన కొండ సాత్విక-అభిజ్ఞకు 20 గ్రాముల వెండి పథకం, ద్వితీయ విజేత తమ్మల మేఘనకు 12 గ్రాముల వెండి, తృతీయ విజేత గుండా శ్వేతకు నగదు బహుమతితోపాటు ఐదురురికి కన్సోలేషన్ బహుమతులను దాత చందు అందించారు. దట్నూర్‌లో ప్రథమ విజేత రాధ, ద్వితీయ విజేత పులి నిహారిక, తృతీయ విజేత పులి సుదీక్షిత గెలుపొందగా సర్పంచ్ బహుమతులు అందించారు.

ధర్మపురి, జనవరి 16: నేరెళ్ల, గోవిందుపల్లి గ్రామాల్లో సోమవారం సంక్రాంతి సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి ముఖ్యఅతిథిగా పాల్గొని మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నేరెళ్ల సర్పంచ్ పలిగిరి వ సుందర, బీజేపీ మండలాధ్యక్షుడు సంగెపు గంగారాం, ఓరుగంటి చంద్రశేఖర్, రామన్న పాల్గొన్నారు.

సారంగాపూర్, జనవరి 16: తుంగూర్ గ్రామంలో ఆదివారం ఉమ్మడి మండల స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించారు. పోటీల్లో తుంగూర్ జట్టు మొదటి స్థానంలో నిలువగా రెండో స్థానంలో కోమన్‌పల్లి జట్టు నిలిచింది. కార్యక్రమంలో సర్పంచ్ గుడిసె శ్రీమతి జితేందర్ యాదవ్, ఎంపీటీసీ ఆడెపు మల్లేశ్వరి, సింగిల్ విండో చైర్మన్ నవీన్ రావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చెరుపూరి సుభాష్, పీఈటీ లక్ష్మణ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

నిందితుల అరెస్టు చూపిస్తున్న పోలీసులు

నాలుగు కిలోల గంజాయి పట్టివేత

రాయికల్, జనవరి 16: భూపతిపూర్ ఎక్స్‌రోడ్ వద్ద పోలీసులు నాలుగు కిలోల గంజాయిని పట్టుకున్నారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా గంజాయిని సరఫరా చేస్తున్న ఐదుగురు యువకులను పట్టుకొని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల రూరల్ సీఐ ఆరీఫ్ అలీ ఖాన్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం , పక్కా సమాచారం మేరకు భూపతిపూర్ ఎక్స్ రోడ్ వద్ద సోమవారం ఎస్ఐ అజయ్ తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా భూపతిపూర్ గ్రామానికి చెందిన ఎండీ దిల్షాద్(23), కడార్ల మహేశ్(19), పెద్దిరెడ్డి జయంత్(23), దొనిపాల సాయి భరద్వాజ్(21)తో పాటు ఒక మైనర్ గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి సుమారు రూ.1,00,750 విలువైన 4.03 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే వారి వద్ద నుంచి ఐదు సెల్ ఫోన్లు, రెండు బైక్‌లను జప్తు చేశారు. నిందితులు ఇటీవలే ఆసిఫాబాద్ జిల్లా నుంచి గంజాయిని తీసుకువచ్చారని పోలీసులు తెలిపారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న ఎస్ఐ అజయ్, కానిస్టేబుళ్లు సాగర్, సంతోష్, ప్రశాంత్‌ను సీఐ ఈ సందర్భంగా అభినందించారు.

నర్సింగాపూర్ శివారులో అక్రమంగా వేసిన గుడిసెల తొలగింపు

నర్సింగాపూర్ శివారులో అక్రమంగా వేసిన గుడిసెలను తొలగిస్తున్న అధికారులు

జగిత్యాల రూరల్, జనవరి 16: నర్సింగాపూర్ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో కొంతకాలంగా వేసిన అక్రమ గుడిసెలను మంగళవారం కలెక్టర్ ఆదేశాల మేరకు పోలీసు, రెవెన్యూ, మున్సిపాల్ అధికారులతో తొలగించినట్లు రూరల్ తహసీల్దార్ రామ్మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నర్సింగాపూర్ శివారులోని ప్రభుత్వ స్థలంలో అక్రమంగా వేసిన ఆరు వందల గుడిసెలను ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లు ఉపయోగించి తొలగించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ప్రభాకర్ రావు, నలుగురు డీఎస్పీలు, పోలీస్, రెవెన్యూ, మున్సిపాల సిబ్బంది పాల్గొన్నారు.

గురువు వైద్యానికి పూర్వ విద్యార్థుల చేయూత

వర్షకొండలో ఉపాధ్యాయుడికి ఆర్థిక సహాయం అందజేస్తున్న విద్యార్థులు

ఇబ్రహీంపట్నం, జనవరి 16: వర్షకొండలో అనారోగ్యంతో బాధపడుతున్న మద్దెనపెల్లి శ్రీకాంత్ అనే ప్రైవేట్ ఉపాధ్యాయుడికి 2013-14 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆర్థిక చేయుతనందించి ఆదర్శంగా నిలిచారు. మంగళవారం పూర్వ విద్యార్థులు శ్రీకాంత్ స్వగృహానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొన్నారు. శ్రీకాంత్ నాలుగు సంవత్సరాల నుంచి ప్రాంకీయాటిస్ అనే వ్యాధితో బాదపడుతున్నాడు. కాగా రోజు ఇంజిక్షన్, మందులు వేసుకుంటే తప్ప బతుకని పరిస్థితి ఏర్పడడంతో డబ్బులు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుసుకొని తమ వంతుగా రూ.10వేల ఆర్థికసాయం అందించారు. ప్రభుత్వం తరపున ఆర్థికసాయం అందించి ఉపాధ్యాయుడిని ఆదుకోవాలని వారు పేర్కొన్నారు. అలాగే దాతలు ఎవరైనా ముందుకొచ్చి ఫోన్‌పే 9989002511 నంబర్‌లో ఆర్థికసాయం చేయాలని పూర్వ విద్యార్థులు కోరారు.

సంక్రాంతి సంబురాలు

మారుతీనగర్, జనవరి 16: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు-సరోజన దంపతుల ఆధ్వర్యంలో మకర సంక్రాంతిని పురస్కరించుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో మకరజ్యోతిని వీక్షించారు. ఆయా కార్యక్రమాల్లో అయ్యప్ప దీక్షపరులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ల నిరసన

మెట్‌పల్లి, జనవరి 16: కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెడుతున్న ప్రమాద చట్టాన్ని వ్యతిరేకిస్తూ మెట్‌పల్లిలో లారీ డ్రైవర్లు, క్లీనర్లు మంగళవారం నిరసన తెలిపారు. నూతన ప్రమాద చట్టం ద్వారా లారీలు నడిపే డ్రైవర్లు, డ్రైవర్ల కుటుంబాలు రోడ్డు మీద పడే విధంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు ఎండీ సలీంఖాన్, వేణు, రవి, భాస్కర్, ఫిరోజ్‌ఖాన్, ఎండీ రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి వేద పరిపాలన సభ

ధర్మపురి, జనవరి 16: ధర్మపురి లక్ష్మీనర్సింహస్వామివారి ఆలయంలో ఈ నెల 18 నుంచి 24 తేదీ వరకు శ్రీ ప్రేమికవరద వేదపరిపాలన సభ నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మెట్‌పల్లి, జనవరి 16: వంజరి సంఘం-2024 సంవత్సర క్యాలెండర్‌ను మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు బొమ్మల శంకర్, నాయకులు నల్ల వెంకట్, లక్ష్మీపతి, భూమేశ్వర్, గంగోని సురేశ్, చిన్నయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందెం శిబిరంపై దాడి

మల్లాపూర్, జనవరి 16: సంక్రాంతి పండుగ సందర్భంగా సాతారం గ్రామ శివారులోని ఓ మామిడి తోటలో రహస్యంగా నిర్వహిస్తున్న కోడి పందెల శిబిరంపై ఎస్ఐ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దాడుల్లో అక్కడ ఉన్న రూ.8500 నగదు, ఆరు పందెం కోళ్లతో పాటు, పలు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే కోడిపందెం ఆడుతున్న ఆరుగురిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

సీపీఎం నాయకుల అరెస్ట్

జగిత్యాల రూరల్, జనవరి 16: తిమ్మాపూర్ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిని కొంతమందితో కలిసి ఆక్రమించి గ్రామస్తులపై దాడి చేసిన కేసులో సీపీఎం నాయకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల రూరల్ పోలీసులు తెలిపారు. వీరిలో గుగులోత్ తిరుపతి నాయక్, కడకుంట్ల నాగరాజు, గర్వందుల రమేశ్, ఇందూరి సులోచన, ఎల్ల పోచన్న, లెల్లాల బాలకృష్ణ, కుంచపు శంకర్, హేమలత, రజియా సుల్తానా ఉన్నారన్నారు.

రామాలయంలో హుండీ చోరీ

కోరుట్ల రూరల్, జనవరి 16: ధర్మారం గ్రామ శివారులోని రామాలయంలోని హుండీని గుర్తు తెలియని దొంగలు సోమవారం రాత్రి ఎత్తుకెళ్లారు. ఆలయానికి పూజారి మంగళవారం ఉదయం వెళ్లే సరికి ఆలయ ఆవరణలో ఉన్న హుండీని దొంగలు ఎత్తుకెళ్లడంతో పూజారి ఆలయ కమిటీ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో వారు మల్లాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఆలయం వెనుక గల వాగు బండరాళ్ల మధ్య హుండీ కనిపించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కేంద్ర పథకాలపై అవగాహన

మారుతీనగర్, జనవరి 16: పట్టణంలోని 10, 11వవార్డుల్లో మహిళలకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపట్టిన పలు సంక్షేమ పథకాలపై మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా వార్డుల ప్రజాప్రతినిధులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉంజల్ సేవ

కోరుట్ల, జనవరి 16: పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరాలయంలో ధనుర్మాస ముగింపు ఉత్సవాల్లో భాగంగా శ్రీవారికి ఏకాంత సేవ, ఉంజల్ సేవ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు భీర్నంచి నర్సింహాచార్యులు, ఆలయ ఈవో విక్రమ్, జూనియర్ అసిస్టెంట్ నర్సయ్య, వెంకటేశ్వర భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

జార్జిరెడ్డికి నివాళి

మేడిపల్లి, జనవరి 16 : భీమారం మండల కేంద్రంలో సోమవారం జార్జిరెడ్డి జయంతిని నిర్వహించారు. జార్జిరెడ్డి ఫ్లెక్సీకి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గల్ఫ్ జేఏసీ చైర్మన్ గుగ్గిళ్ల రవిగౌడ్, టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ గల్ఫ్ కన్వీనర్, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్ రెడ్డి, నాయకులు చెక్కపెల్లి రఘు, చెక్కపెల్లి సంజీవ్, బొమ్మెన ప్రశాంత్, శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సారంగాపూర్, జనవరి 16: బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామంలో సర్పంచ్ గుడిసె శ్రీమతి-జితేందర్ యాదవ్ సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. బీడీ కార్మికుల కాలనీకి సీసీ రోడ్డు మంజూరైంది. కార్యక్రమంలో నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

అక్షింతల వితరణ

మెట్‌పల్లి రూరల్, జనవరి 16: సత్తక్కపల్లి గ్రామంలో శ్రీరామ జన్మభూమి అయోధ్య తీర్థ క్షేత్ర ట్రస్ట్ నుంచి వచ్చిన అక్షింతలను వితరణ చేశారు. మంగళవారం రామభక్తులు, యువకులు ఇంటింటికీ తిరుగుతూ అక్షింతలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రవీణ్, మహేశ్, మురళి, స్వామి, శేఖర్, నవీన్, సతీశ్, మారుతి పాల్గొన్నారు.